# ప్రకటన

ప్రతాప రవిశంకర్

తెలతెలవారుతున్నప్పుడు రైల్వేస్టేషన్ దగ్గరకు వెళ్లి ఆరోజు దినపత్రికను కొన్నాడు శిఖామణి. ఇంకొంచెం సేపట్లో బయల్దేరే రైలుకు వెళ్లటానికి జనం టిక్కెట్ల కోసం ఎగబడుతున్నారు. చేతిలో దినపత్రికతో నిలబడి కొంచెంసేపు వాళ్లని చూసి తిరిగి రోడ్డుమీదకు వచ్చాడు.

వీధి దీపాలు ఇంకా వెలుగుతూనే వున్నాయి. అప్పుడే క్రమంగా చీకట్లు విచ్చుకుంటున్నాయి. నడుస్తున్న శిఖామణి స్ట్రీటు లైటు దగ్గర నిలబడి దినపత్రిక మడత విప్పి అందులో ప్రకటనలు వున్న పేజీని బయటకు తీశాడు. కొంచెంసేపటికి అతనికి తను ఇచ్చిన ఇంటి అమ్మకపు ప్రకటన కనిపించింది.

ఇల్లు అమ్మకము - జగదాంబ సెంటర్ ప్రాంతంలో రెండు వందల ఇరవై గజముల ఇల్లు అన్ని సౌకర్యములతో రెండు రోడ్ల కార్నర్‌లో అమ్మకమునకు కలదు. సంప్రదించండి - అని పక్కనే సెల్‌ఫోన్ నెంబర్ వుంది.

శిఖామణి ఆ ప్రకటనను రెండుసార్లు చదివాడు. ఆ ప్రకటన కిందనే మరికొన్ని ప్రకటనలు వున్నాయి.

చలిగా వుండటంతో శిఖామణి స్వెట్టర్ వేసుకున్నాడు. తలకు మఫ్లర్ చుట్టుకొన్నాడు. డిసెంబర్ నెల చివరి రోజులు. కొద్దిగా మంచు పడుతోంది. రోడ్లమీద అప్పుడప్పుడే జనసంచారం మొదలవుతోంది. స్టేషన్ రోడ్‌లో వున్న టీ దుకాణాల్లో



ఒకరిద్దరు నిలబడి టీ తాగుతున్నారు.

శిఖామణి రోడ్డు మీద నడుస్తూ ఒక టీకొట్టు ముందు ఆగి టీ తాగాడు. తర్వాత స్వెట్టర్ లోపలికి చేతిని పోనిచ్చి జేబులోనుంచి సిగరెట్టు పెట్టెను బయటకు తీసి రోడ్డుమీద నడుస్తూనే సిగరెట్టు ముట్టించి గుండెలనిండా పొగ పీల్చాడు.

శిఖామణి సన్నగా వున్నాడు. అతని దవడలు లోపలకు పీక్కుపోయాయి. సన్నగా వున్నందువల్ల కొంచెం మత్తుగా వున్నట్టు కనపడతాడు గానీ నిజానికి అతను అంత పొడుగైన మనిషి కాదు. వదులుగా వున్న పైజమా – కాళ్లకు తోలు చెప్పులు.

అతని మనసంతా తనిచ్చిన ఇంటి ప్రకటన మీదనే వున్నది. ఉదయం నిద్ర లేవగానే న్యూస్‌పేపర్ చదివే అలవాటు వున్న వాళ్లంతా పేపర్‌ను చదువుతూ వుంటారు. కానీ ఇంటి అవసరం వున్న వాళ్లు మాత్రమే తనిచ్చిన ఇంటి అమ్మకపు ప్రకటనను చూస్తారు.

ఉదయం ఎనిమిది గంటలయ్యింది. అప్పటికి శిఖామణి స్నానం చేసి, టిఫిన్ తిని తనకు రాబోయే ఫోన్‌కాల్స్ గురించి ఎదురుచూస్తూ ఓ పార్కులో కూర్చున్నాడు.

ఆదివారం కావటంతో చాలా దుకాణాలు మూసి వున్నాయి. ఫుట్‌పాత్‌ల మీద వ్యాపారాలు అప్పుడే మొదలవబోతున్నాయి. రోడ్డు పక్కనే వున్న పార్కులో కూర్చున్న శిఖామణికి రోడ్డంతా క్లియర్‌గా కనపడుతోంది.

ఎండగా వుంది గానీ అందులో చురుకుదనం లేదు. బద్ధకంగా వెలుగుతున్నాడు సూర్యుడు. పార్కులో కొంచెం ఎత్తుగా పెరిగిన చెట్ల నీడ అతని మీద పడటం లేదు.

సిమెంటు బెంచీ మీద కూర్చుని శిఖామణి దినపత్రికను చదువుతున్నాడు. కొన్ని వార్తలు అతనికి రొటీన్‌గా అనిపించాయి. ఒక కిడ్నాపింగ్ వార్తను చదువుతున్నప్పుడు సెల్‌ఫోన్ రింగయ్యింది.

బటన్ నొక్కి 'హలో' అన్నాడు శిఖామణి.

''నా పేరు చిదంబరం... ఇవాల్టి దినపత్రికలో ఇంటి ప్రకటన ఇచ్చింది మీరేకదూ'' అని అడిగాడతను.

''అవును.... నేనే...''

''నమస్కారం... నేను ఇల్లు కొనే ప్రయత్నంలో వున్నాను. ఇప్పుడే మీ ఇంటి ప్రకటన చూశాను. నేను మీతో మాట్లాడాలి''.

''మాట్లాడండి...'' అన్నాడు శిఖామణి.

''ఇలా ఫోన్లో కాదు.. మిమ్మల్ని కలిసి మాట్లాడాలి... మీ ఇంటిని కూడా చూడాలి... అందువల్ల మీరు అడ్రసు చెబితే..''

చిన్నగా నవ్వాడు శిఖామణి.

నవ్వి ''మీ ఆలోచన బాగానే వుంది... కానీ మీరు నేను ఇంటిని అమ్మే ధరను భరించగలరో లేదో ముందు నాకు తెలియాలి గదా'' అన్నాడు.

''అయితే మీరు ఇంటిని ఎంతకు అమ్మాలని అనుకుంటున్నారో చెప్పండి'' అన్నాడు చిదంబరం.

''మీరు ఎంతలో కొనాలని అనుకుంటున్నారో ముందు చెప్పండి'' అన్నాడు శిఖామణి...

''పన్నెండు లక్షల్లో...''

''సారీ... నా ధరను మీరు అందుకోలేరు. చాలా వ్యత్యాసం వుంది''.

''ఎంత చెబుతున్నారేమిటి?'' చిదంబరం అడిగాడు.

''ఇరవై లక్షలు''

''చాలా డిఫరెన్స్ వుంది... అంతకు నేను తూగలేను... ఇంకోమాట చెబుతారా?''

''సారీ... ఒక్క వెయ్యి కూడా తగ్గించను'' అని ఫోన్‌ని డిస్కనెక్ట్ చేశాడు శిఖామణి.

మళ్లీ ఇంకోసారి ఫోన్ రింగయ్యేలోపల శిఖామణి రెండు సిగరెట్లు కాల్చాడు. పావు తక్కువ తొమ్మిది గంటలు కావస్తున్నప్పుడు అతడి చేతిలో వున్న సెల్‌ఫోన్ ఇంకోసారి రింగయ్యింది.

'హల్లో... ఎవరో చెప్పండి'' అన్నాడు శిఖామణి.

''దినపత్రికలో ఇంటి ప్రకటన ఇచ్చారు... అందు గురించి మాట్లాడాలి''



## కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనానికి

కాల్షియం, ఐరన్ లోపించడం వల్ల కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు ఎక్కువగా బాధిస్తుంటాయి. ముఖ్యంగా నడివయసు స్త్రీలు అంటే ముప్పయి అయిదు, నలభై ఏళ్ల వయసులో కీళ్లనొప్పులతో బాధపడే వారి శాతం ఈ మధ్య మరీ ఎక్కువగా వుంటోంది. కీళ్లనొప్పులతో బాధపడుతుండేవారు ఈ కింది చిట్కాలు పాటించి చూడండి.

* వెల్లుల్లి రేకలను మెత్తగా నూరి పల్చని బట్టలో వేసి కడితే పది హేను రోజులలో కీళ్లనొప్పులు తగ్గుతాయి.
* వామును నూరి మంచినూనె కలిపి నొప్పులు వున్నచోట మర్దనా చేయాలి.
* గన్నేరు ఆకులను నీటిలో మరగబెట్టి నూనెలో కలిపి మర్దించాలి.
* నల్లవావిలాకుకు ఆముదం పూసి వెచ్చచేసి కట్టినా నొప్పులు, వాపులు తగ్గుతాయి.
* బూరుగచెట్టు బెరడును చితకగొట్టి ఆముదమును ఉడికించి కట్టాలి.
* లేత మునగ ఆకులను నేతిలో వేయించి తిన్నా కీళ్లనొప్పులు తగ్గుతాయి.
* సోమింత ఆకును ఆముదంలో వేసి వెచ్చచేసి కట్టుకడితే కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఎవరిదో ఆడగొంతు... నడివయసు ఆమె అయి వుండాలనుకున్నాడు శిఖామణి.

''అయితే మాట్లాడండి''

''మీ ఇల్లు ఎక్కడో సరయిన లొకేషన్ చెబుతారా? నేను ఒకసారి ఇంటిని చూసి మీతో మాట్లాడతాను''

''నా పేరు శిఖామణి... ముందుగా మీ పేరేమిటో చెబుతారా?''

''ప్రియంవద... చెప్పండి జగదాంబ సెంటర్‌లో మీ ఇల్లు ఎక్కడుంది?''

''ఇంటిని మీరు చూస్తే సరిపోతుందా? మీవారు చూడాల్సిన అవసరం లేదా?'' అడిగాడు శిఖామణి.

ఆమె నవ్వి ''అవసరం లేదు... ఆయనతో నాకు సంబంధం లేదు. విడాకులు తీసుకున్నాను. నేను ఎంప్లాయిని.. ఇప్పటిదాకా ఓ అద్దె ఇంట్లో వుంటున్నాను. సొంత ఇల్లు కొనాలని ఈమధ్యనే అనుకున్నాను. అందుకే మీ ప్రకటన చూసి ఫోన్ చేశాను'' అన్నది.

''మీకు పిల్లలున్నారా?'' అడిగాడు శిఖామణి.

''లేరు... ఎందుకు?''

''సారీ... నా ఇంటిని మీకు అమ్మలేను''

ప్రియంవద వెంటనే అడిగింది ''ఎందుకు?''

''నాకు కొన్ని సెంటిమెంట్లున్నాయి'' అని డిస్కనెక్ట్ చేశాడు.

కొంచెంసేపు తనకు ఫోన్ చేసిన ఆమె గురించి ఆలోచించి తర్వాత మళ్లీ రోడ్డుమీద తిరుగుతున్న మనుషుల్ని, వాహనాలనీ చూడడంలో మునిగిపోయాడు.

పార్కు ఎదురుగా వున్న ఫుట్‌పాత్ మీద ఇద్దరు మనుషులు రకరకాల షర్టులను గుట్టగా పోసి పెద్దగా అరుస్తూ అమ్ముతున్నారు. పక్కనే ఒకామె స్కూలు పిల్లల బ్యాగులను వరుసగా పెట్టి అమ్ముతోంది. తోపుడు బండ్లమీద ప్లాస్టిక్ వస్తువులమ్మే వాళ్లు కూడా ఆ వరసలోనే వున్నారు.

శిఖామణి చూస్తుండగానే ఎవరో ఒకాయన వచ్చి అతని పక్కనే ఆ సిమెంటు బెంచీమీద కూర్చుని జేబులోనుంచి విష్ణు సహస్రనామం పుస్తకం తీసి చిన్నగా చదవటం మొదలుపెట్టాడు.

ఆయనతో ఏదో మాట్లాడాలి అనుకునేంతలో శిఖామణి చేతిలో సెల్‌ఫోన్ రింగయ్యింది.

బటన్ నొక్కి''ఎవరో చెప్పండి'' అన్నాడతను.

''మీరిచ్చిన ఇంటి ప్రకటన ఇప్పుడే చూశాను.. నాపేరు శివపాదం... ఇంతకీ ఆ ఇల్లు వుందా? ఇప్పటికే బేరం కుదిరిందా?'' అనడిగాడు ఆత్రంగా...

''ఉందిలెండి.. ముందు మీ గురించిన వివరాలు చెప్పండి'' అన్నాడు శిఖామణి చిన్నగా నవ్వి.

''నాపేరు శివపాదమని చెప్పాను గదా.. సెంట్రలు గవర్నమెంటులో సూపర్నెంటుగా



## మన్‌హటన్

మన్‌హటన్ అందాల గురించి వర్ణించమంటే ఎక్కువగా హాలీవుడ్ దర్శక నిర్మాతల్నడిగితే చెబుతారు. సాయం సంధ్య సమయంలో యూరప్‌కు చెందిన ఓ ఫొటో(గ్రాఫర్ తీసిన ఫొటో ఇది. సూర్యాస్తమంలో కిరణాలన్నిటినీ ఒంటికి కప్పుకుని మెరిసిపోయే మన్‌హటన్ నగరాన్ని ఏరియల్ వ్యూలో తీసిన ఫొటో ఇది. ఎన్నో హాలీవుడ్ సినిమాల షూటింగులకు వేదికగా వున్న ఇక్కడ మరెందరో ధనవంతులు విలాసవంతంగా గడుపుతూంటారు.

పనిచేసి ఈమధ్యనే రిటైర్ అయ్యాను. రావలసిన డబ్బు మొత్తం చేతికొచ్చింది. ఇన్నాళ్ళు అద్దె ఇళ్లల్లో వుండి ఎన్నో బాధలు పడ్డాను. సొంత ఇల్లు కావాలనేది నా చిరకాల వాంఛ. అది ఇప్పటికి నెరవేరేలా వుంది. ఈ వయసులో దగ్గరుండి కొత్త ఇంటిని కట్టించే ఓపిక లేదు. అందుకే కట్టిన ఇంటిని కొనాలని అనుకుంటున్నాను. మీ ఇంటి అడ్రసు చెబితే ఇప్పుడే వస్తాను''.

''వద్దురుగాని... అందుకు అభ్యంతరం లేదు. ఇంతకీ మీరు ఎక్కడ వుంటున్నారు?''

''గాజువాక''

''అంతదూరంనుంచి రాబోయే ముందు నా ఇంటి ధరకు మీరు తూగగలరో లేదో మాకు తెలియాలి గదా'' అన్నాడు శిఖామణి.

''అవును.. ఇంతకీ మీ ఇంటి ధర ఎంత?''

''ఇరవై లక్షలు''

''ఇరవై లక్షలా! నేను పధ్నాలుగులో వున్నాను. నేను ఆఫర్ చేసే ధరకు దిగిరాగలరా?'' ఆశగా అడిగాడు శివపాదం.

''వెరీసారి... వెయ్యి కూడా తగ్గించలేను''

సెల్‌ఫోన్‌ను జేబులో వేసుకున్నాడు.

విష్ణుసహస్రనామం చదువుతున్నాయన ఆశ్చర్యంగా శిఖామణిని చూసి ''మీ ఇల్లును అమ్ముతున్నారా? ఎక్కడేమిటి? ఎప్పట్నించో మా అమ్మాయి అడుగుతోంది ఓ ఇల్లు చూసిపెట్టమని'' అన్నాడు.

''జగదాంబ సెంటర్ ప్రాంతంలో... కనకమాలక్ష్మి గుడికి వెళ్ళే దారిలో వుంది.. ఇంతకీ మీ అల్లుడు ఏం చేస్తూ వుంటాడు?'' అడిగాడు శిఖామణి.

''చెప్పుల షాపులో''

అప్పుడు శిఖామణి నవ్వి ''నా ఇంటి ఖరీదు ఎంతో వినే వుంటారు. ఇరవై లక్షలకు తూగగలరా?'' అనడిగాడు.

''కష్టం... అంత డబ్బు లేదు'' అని మళ్లీ సహస్రనామం చదవటం మొదలుపెట్టాడు.

చెట్టు నీడ శిఖామణి కూర్చున్న బెంచీమీద పడుతోంది... రోడ్డుమీద సందడి బాగా పెరిగిపోయింది.

శిఖామణి ఇక లేద్దామని అనుకుంటున్నప్పుడు సెల్‌ఫోన్ రింగయ్యింది.

బటన్ నొక్కి హలో అనగానే ''ఎవరు మాట్లాడేది?'' అనడిగాడతను ఎవరో...

''నాపేరు శిఖామణి.. మీరెవరో చెబుతారా?''

''నన్ను రుద్రరాజు అంటారు... ఇల్లు అమ్మకానికి వుందని ప్రకటన ఇచ్చారు గదా... ఇంటి అడ్రసు చెప్పండి... నేను నా భార్యను తీసుకొని వస్తాను'' అన్నాడతను.

''రండి... కానీ ముందు మీ గురించి నేను తెలుసుకోవాలి గదా.. మీరేం చేస్తూ వుంటారు?''

''ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్‌గా చేస్తున్నాను''.

''పిల్లలున్నారా?''

''ముగ్గురు పిల్లలు... ఇంకా ఏమైనా డిటెయిల్స్ కావాలా? అడగండి చెబుతాను'' అన్నాడు రుద్రరాజు.

''ఇంకేమీ అవసరం లేదు... ఇంతకీ ఎంతలో మీరు ఇంటిని కొనాలని అనుకుంటున్నారో చెప్పండి.. లేకపోతే ఇంతదూరం వచ్చి నిరాశగా వెళ్లాల్సి వుంటుంది.''

''మీ రేటు చెప్పండి.. జగదాంబ సెంటర్ ప్రాంతంలో అంటే దాదాపుగా ధరను నేను కొంత అంచనా వేయగలను''.

''ఇరవై లక్షలు'' చెప్పాడు శిఖామణి.

''ఇల్లు అన్నివిధాలా నచ్చితే ఆ రేటుకు కొనడానికి నాకు అభ్యంతరం లేదు. ఇంతకీ నేను మిమ్మల్నో ప్రశ్న అడుగుతాను.''

''అడగండి''

''మీరు మీ ఇంటిని ఎందుకు అమ్ముతున్నారో తెలుసుకోవచ్చునా?''

''తప్పకుండా... నేను ప్రభుత్వ సర్వీసులో ఎప్పుడో రిటైర్ అయ్యాను. నాకున్న ఒకేఒక్క కొడుకు గుజరాత్‌లో వున్నాడు. ఇక్కడ నేనూ నా భార్యా వుంటున్నాం... ఎప్పట్నించో మా అబ్బాయి మమ్మల్ని కూడా అక్కడికే రమ్మని అంటున్నాడు. వాడు ఇక్కడకు వచ్చే అవకాశం లేదు. అందుకే మేము అక్కడకు వెళ్లాలని ఇల్లు అమ్మకానికి పెట్టాం''.

''థాంక్యూ... అయితే ఎడ్రసు చెబుతారా?''

''ఇంకో అరగంట తర్వాత చెప్పగలను. ఈ ఇంటి ప్రకటన ఇచ్చినట్టుగా మా అబ్బాయికి చెప్పలేదు. వాడిక్కూడా ఫోన్ చేసి ఒకమాట చెబుతాను. సరిగ్గా అరగంట తర్వాత మళ్లీ ఫోన్ చెయ్యగలరా?''

''ఆల్‌రైట్'' అన్నాడు రుద్రరాజు.

తర్వాత శిఖామణి పార్కులోనుంచి బయటకు వచ్చాడు. రోడ్డు మీద నడుస్తూ మధ్యలో ఆగి సిగరెట్టు కొన్నాడు. అతను కనకమాలక్ష్మి గుడికి వెళ్ళి బయటకు వస్తున్నప్పుడు రుద్రరాజు మళ్లీ ఫోన్ చేశాడు.

''సారీ.. మా అబ్బాయి ఇక్కడే వుంటున్న వాళ్ళ ఫ్రెండ్‌కు మా ఇంటిని అమ్ముతానని ప్రామిస్ చేశాడట. ఐయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ'' అన్నాడు శిఖామణి విచారం నిండిన గొంతుతో.

రుద్రరాజు మాట్లాడకుండా ఫోన్ పెట్టేశాడు.

శిఖామణి ఓ బట్టల షాపులో గుమస్తాగా చేసి ఈమధ్యనే రిటైర్ అయ్యాడు. అతని స్థానంలో అతని కొడుకు ఆ ఉద్యోగాన్ని చేస్తున్నాడు. ఇద్దరాడపిల్లల్లో ఇంకో అమ్మాయి పెళ్లికి వుంది. శిఖామణి ఇప్పటికీ ఊరి చివరగా చాలా తక్కువ అద్దెలో ఓ రేకుల షెడ్డులో కాపురం వుంటున్నాడు. సొంత ఇంట్లో వుండాలనేది అతని చిరకాల వాంఛ. అది ఈ జన్మకు తీరదని తెలిసి, వచ్చిన డబ్బులో కొంతపెట్టి సెకండ్‌హ్యాండ్ సెల్‌ఫోన్‌ని కొని ఈ ఇంటి అమ్మకపు ప్రకటనను దినపత్రికలో ఇచ్చాడు.

అంతా గుర్తుకువచ్చి చేతిలో దినపత్రికతో నవ్వుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నాడు శిఖామణి.

*(ఇలాంటి ట్విస్టు కథలకు ఆద్యులు, నా మిత్రులు శ్రీ మల్లాది వెంకటకృష్ణమూర్తి గారికి ఈ కథ నా స్నేహకానుక)*

### కాలు జారడం

కాలు జారినా ఫరవాలేదు –
నోరుజారితే సరిదిద్దుకోలేం!
పొగరుగా మాట్లాడినప్పుడల్లా అమ్మ హెచ్చరిక
ఓహో, కాలు జారినా పరవాలేదంది గదా అని
కాలుజారా ఓనాడు
నీ మొహంమండా, కాలు జారడం అంటే ఇదిగాదే
అమ్మ నెత్తి నోరు బాదుకుని అంది
ఈ పెద్దాళ్లెప్పుడూ యింతే అర్థాలు సరిగా చెప్పరు!

– డి.కామేశ్వరి